మేడిగడ్డ బరాజ్‌ను వీక్షిస్తున్న పర్యాటకులు

బరాజ్‌ను చూసి సంబురపడి..

- **మేడిగడ్డ వద్ద పర్యాటకుల సందడి**

మహదేవపూర్, జూన్ 15 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ(లక్ష్మి) బరాజ్ వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. సెల్ఫీలు దిగుతూ సంబురపడ్డారు. కేసీఆర్ ముందు చూపుతోనే ప్రపంచంలో అద్భుతమైన ప్రాజెక్టు రూపుదిద్దుకున్నదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యంతో జలకళను సంతరించుకోవాల్సిన మేడిగడ్డ బరాజ్ ఎడారిని తలపించడం బాధగా ఉందని చర్చించుకున్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో మరమ్మతు చేపట్టి బరాజ్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

కేసీఆర్ గొప్ప వ్యక్తి

ప్రపంచంలోనే అత్యంత అద్భుతమైన ప్రాజెక్టు కాళేశ్వరం. ఇంతటి గొప్ప ప్రాజెక్టు కట్టిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు రుణపడి ఉంటారు. ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యంతో ప్రాజెక్టు నిరాదరణకు గురవుతున్నది. కేసీఆర్ సార్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడు. కేసీఆర్‌ను కొందరు కావాలని కించపరచడం సరికాదు.

- అడపాజు శ్రీనివాసాచారి, హైదరాబాద్

కేసీఆర్ పాలనలోనే వైద్యరంగం అభివృద్ధి

- **రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**

హైదరాబాద్ జూన్ 15 (నమస్తేతెలంగాణ): కేసీఆర్ పదేండ్ల పాలనలోనే వైద్యరంగం పురోగమించిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కొనియాడారు. ఆదివారం ఓ యూట్యూబ్ చానల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సుమారు 500 మంది డాక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తెలంగాణలో వైద్యరంగం వెనుకబడి ఉండేదని, కేసీఆర్ దూరదృష్టితో ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యమందించే లక్ష్యంతో జిల్లాకో మెడికల్, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటుచేశారని ఎంపీ రవిచంద్ర గుర్తుచేశారు. హరీశ్‌రావు సైతం మంత్రిగా దవాఖానల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి ప్రారంభం

- **వార్షిక మరమ్మతులు పూర్తి**

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 15: పెద్దపల్లి జిల్లా రామగుండం ఎరువుల కర్మాగారంలో నెల రోజుల తర్వాత ఆదివారం యూరియా ఉత్పత్తి ప్రారంభమైంది. వార్షిక మరమ్మతుల్లో భాగంగా ఇటీవలే షట్‌డౌన్ చేశారు. ఉత్పత్తిలో కీలకమైన క్యాటలీస్ రాక ఆలస్యంతో ఎనిమిది రోజులపాటు లేటుగా ఉత్పత్తి మొదలైంది. 2022-23లో 8.40 లక్షల టన్నులు, 2023-24లో 11.95 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగింది. ఉత్పత్తిలో ప్రతి ఏడాది 40 శాతం అంటే సుమారు 3.50 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికే సరఫరా చేస్తున్నది. పలు రాష్ట్రాలకు 10 శాతం చొప్పున సరఫరా చేస్తున్నారు. రాష్ట్రానికి ఈ వానకాలంలో పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులోకి రానున్నది.

బనకచర్లను అడ్డుకోండి

- **అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌ను కోరండి**
- **రాష్ట్ర జలహక్కులను కాపాడండి**
- **లేదంటే తెలంగాణకు తీరని నష్టం**
- **మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ**

> తెలంగాణకు సంబంధించిన మూడు ప్రాజెక్టులు కాళేశ్వరం 3వ టీఎంసీ, సమ్మక్క సాగర్, బీఆర్ అంబేద్కర్ వార్ధా డీపీఆర్‌లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నయి. వాటికి అనుమతులు రాకుండానే.. మన వినియోగాలు పూర్తిస్థాయిని అందుకోకముందే ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం అనుమతిస్తే తెలంగాణ ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బ తింటయి.
>
> **- హరీశ్‌రావు**

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం అక్రమంగా చేపట్టిన గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టును అడ్డుకోవాలని, అందుకోసం వెంటనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రాన్ని కోరాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ జల హక్కులను కాపాడాలని, అందుకోసం చేసే ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ఈ మేరకు రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 200 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్ మీదుగా పెన్నాబేసిన్ మళ్లించేందుకు గోదావరి - బనకచర్ల లింకు ప్రాజెక్టును సుమారు రూ.80 వేల కోట్లతో చేపడుతున్నదని, అందుకోసం ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేయడమేగాక ఇటీవల ప్రీ ఫీజిబులిటీ రిపోర్టు (పీఎఫ్‌ఆర్)ను కూడా సమర్పించిందని, కేంద్రం సైతం ఆ నివేదికను తెలంగాణ సహా అన్ని గోదావరి పరీవాహక రాష్ట్రాలకు పంపినట్టుగా తెలుస్తున్నదని పేర్కొన్నారు. పీఎఫ్‌ఆర్‌లో పొందుపరిచిన వివరాల ప్రకారం జీబీలింక్‌ను మూడు సెగ్మెంట్లుగా విభజించారని, పోలవరం జలాశయం నుంచి ప్రకాశం బరాజ్‌కు, అక్కడి నుంచి 150 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన బొల్లపల్లి కృత్రిమ జలాశయానికి, బొల్లపల్లి జలాశయం నుంచి బనకచర్ల రెగ్యులేటర్ కాంప్లెక్స్‌కు నీటిని తరలించనున్నారని తెలిపారు. ప్రాజెక్టు పనులను కొనసాగించకుండా ఏపీని నిరోధించాలని కోరుతూ కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు మంత్రి ఉత్తమ్ లేఖ రాయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా జీబీ లింక్

ఏపీ రాష్ట్ర పునర్విభజన చట్టం - 2014 ప్రకారం ఏదైనా కొత్త ప్రాజెక్టు చేపట్టినప్పుడు గోదావరి / కృష్ణా బోర్డుల అనుమతి, ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని, కానీ ఏపీ ఆ నిబంధనలన్నీ ఉల్లంఘించి ప్రాజెక్టు నిర్మాణం కోసం ముందుకు సాగుతున్నదని, టెండర్లు కూడా పిలిచేందుకు సిద్ధమవుతున్నదని హరీశ్ వివరించారు.

969 టీఎంసీల వాటా ఉన్నా వాడుకోలేని దుస్థితి

గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ఆధారంగా ఆ నదిలో తెలంగాణ వాటా 969 టీఎంసీలు అని, ఉమ్మడి రాష్ట్రంలో వివిధ జీవోల ద్వారా తెలంగాణ ప్రాజెక్టులకు ఆ మేరకు నీటి కేటాయింపులు చేశారని, కానీ నాడు ఆ మేరకు ప్రాజెక్టులు నిర్మించలేదని, తెలంగాణ వాస్తవ వినియోగం 200 టీఎంసీలకు మించి దాటలేదని వివరించారు. 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ నాయకత్వంలో గోదావరి జలాల సంపూర్ణ వినియోగం లక్ష్యంతో గోదావరి బేసిన్‌లో అనేక భారీ ప్రాజెక్టులు చేపట్టారని, పలు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ సర్కారు చర్యల ఫలితంగా గోదావరి జలాల వినియోగం గణనీయంగా 600 టీఎంసీలకు పెరిగిందని వివరించారు. జలాల పూర్తి స్థాయి వినియోగం కోసం ఇంకా చేయాల్సింది ఎంతో ఉన్నదని, ముఖ్యంగా కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల కాలువల తవ్వకం పూర్తి చేసి గోదావరి నీటిని సంపూర్ణంగా వినియోగంలోకి తేవాల్సి ఉన్నదని తెలిపారు. ఏపీ ఇప్పటికీ తెలంగాణ వాటా 969 టీఎంసీలను వ్యతిరేకిస్తూనే ఉన్నదని, తమ వాటా 775 టీఎంసీలని వాదిస్తున్నదని గుర్తుచేశారు. ట్రిబ్యునల్ ఏర్పాటు కోసం 2023లోనే ఏపీ కేంద్రానికి లేఖ రాసిందని, ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ ఏర్పాటుకు ముందే జీబీ లింకు ప్రాజెక్టును అమలు చేసి 200 టీఎంసీలపై హక్కులను కోరాలన్నదే ఏపీ పన్నాగమని వివరించారు. దాని వల్ల ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పొందిన వాటాకు గండి పడనున్నదని హెచ్చరించారు.

> గోదావరి-బనకచర్లప్రాజెక్టుతో తెలంగాణ ప్రయోజనాలకు ముప్పు పొంచి ఉన్నది కాబట్టి భేషజాలకు పోకుండా, రాజకీయాలకు తావు లేకుండా వీలైనంత త్వరలో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయండి. లేదంటే ప్రత్యేక శాసనసభా సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ అంశంపై ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోండి.
>
> **- హరీశ్‌రావు**

> ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరద జలాలను మాత్రమే తరలిస్తామంటున్నది. కానీ, గోదావరి ట్రిబ్యునల్ అవార్డులో నికరజలాలు, అదనపు జలాలు అన్న విభజనే లేదు. ఆల్ వాటర్స్ మాత్రమే. కాబట్టి గోదావరి జలాల తరలింపునకు బదులు కృష్ణా నికర జలాల్లో 157.5 టీఎంసీల నీటి డిమాండ్‌ను కృష్ణా ట్రిబ్యునల్ ముందు ఉంచే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలి. న్యాయ నిపుణులతో చర్చించాలి.
>
> **- హరీశ్‌రావు**

తెలంగాణ ప్రయోజనాల కోసం కలిసివస్తం

గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కుడి కాలువ ద్వారా కృష్ణా డెల్టా అవసరాలకు తరలించుకోవచ్చని, ఆ మేరకు కృష్ణా నీటిని నాగార్జునసాగర్ ఎగువన వినియోగించుకునేందుకు అనుమతించిందని, మహారాష్ట్రకు 14 టీఎంసీలు, కర్ణాటకకు 21 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 45 టీఎంసీలను కేటాయించి ఆ తర్వాతే పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం అనుమతించిందని వెల్లడించారు. రాష్ట్ర విభజన తర్వాత నాగార్జునసాగర్ ఎగువన తెలంగాణ రాష్ట్రమే ఉన్నది కనుక ఉమ్మడి ఏపీకి కేటాయించిన 45 టీఎంసీలు తెలంగాణకే చెందుతాయని, అందుకే ఆ నికర జలాలను పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించామని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లు పోరాడి సెక్షన్ 3 కింద విచారణకు అదనపు టీవోఆర్‌ను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు ఇప్పించడంలో విజయం సాధించిందని, అందులో భాగంగా 45 టీఎంసీల కేటాయింపు అంశం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించిందని, ఆ నీటిని తెలంగాణకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను కోరిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఆయా అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తగిన చర్యలు చేపట్టాలని, రాజకీయాలకు తావు లేకుండా బీఆర్ఎస్ తోడుగా నిలబడుతుందని హరీశ్ స్పష్టంచేశారు.

మెడికోల పోరుబాట

- **స్టైపెండ్ కోసం నేటి నుంచి విధుల బహిష్కరణ**
- **ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో కఠిన నిర్ణయం**

హైదరాబాద్ జూన్ 15 (నమస్తేతెలంగాణ): ప్రైవేట్ మెడికల్ కాలేజీల మెడికోలు ఇంటర్న్స్ స్టైపెండ్ కోసం పోరుబాట పడుతున్నారు. మూడు నెలలుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ అకడమిక్(డీఎంఈ), టీజీఎంసీ చైర్మన్ల దృష్టికి పలుమార్లు సమస్యలను తీసుకెళ్లారు. అనేకసార్లు వినతిపత్రాలు అందించారు. మంత్రిని కలిసి కొన్ని వైద్య కళాశాలలు విద్యార్థుల ఖాతాల్లో ఇంటర్న్స్ స్టైపెండ్ జమచేసి తిరిగి వాపస్ తీసుకుంటున్నాయని ఆధారాలు సమర్పించారు. అయినా పట్టించుకోకపోవడంతో నిరసనలకు ఉపక్రమించాలని నిర్ణయించారు. ఈ దిశగా కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి విధులు బహిష్కరించనున్నట్టు ప్రకటించారు. సర్కారు, ప్రైవేట్ మెడికల్ కాలేజీల యాజమాన్యాలు దిగొచ్చేదాకా పోరాటాన్ని ఆపబోమని హెచ్చరించారు.

జాతీయ లోక్ అదాలత్‌తో 1.93 లక్షల కేసుల పరిష్కారం

- **డీజీపీ జితేందర్ వెల్లడి**

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 14న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌తో రాష్ట్ర వ్యాప్తంగా 1,93,439 కేసులు పరిష్కారమైనట్టు డీజీపీ జితేందర్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరిష్కారమైన కేసుల్లో 6,294 సైబర్, 22,095 ఎఫ్ఐఆర్, 8,922 విపత్తు నిర్వహణ చట్టం, 84,601 ఈ-పెటీ, 71,527 మోటారు వాహన చట్టం కేసులు ఉన్నట్టు వివరించారు. వీటిలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 32,171, రాచకొండ 21,397, నల్లగొండ 16,496, వరంగల్ 13,651, రామగుండంలో 13,316 కేసులు ఉన్నట్టు తెలిపారు. ఒకేసారి సుమారు రెండు లక్షల కేసులు పరిష్కారమయ్యేందుకు కృషి చేసిన రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా న్యాయమూర్తులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిబ్బందిని డీజీపీ అభినందించారు.

తెలంగాణకు కాళేశ్వరం అద్భుత వరం

- **బీజేపీ ఎంపీ ఈటల స్పష్టీకరణ**

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుత వరమని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల భూగర్భ జలాలు పెరిగాయని, వేసవిలో సైతం చెరువులు మత్తళ్లు దుంకాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ప్రజలకు 100 శాతం ఉపయోగం ఉన్నదని తెలిపారు. ఆదివారం ఓ న్యూస్ చానెల్ ఇంటర్వ్యూలో ఈటల మాట్లాడుతూ.. 'కాళేశ్వరం ఈ రోజు ఎస్సారెస్పీలో 14.8 లక్షల ఎకరాలకు బావుల్లో ఎలాంటి పూడికలు తీయకుండా చివరి ఆయకట్టుకు నీళ్లు అందించింది. మిడ్‌మానేరు నుంచి అవసరమైతే రివర్స్ పంపింగ్ ద్వారా నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు లిఫ్టు ఇరిగేషన్‌కు నీళ్లు ఇచ్చేందుకు కూడా గ్యారెంటీ ఏర్పడింది. వాగులు పారినయ్. ప్రాణహిత-చేవెళ్ల, మేడిగడ్డ కింద వాగులు, వంకలు పొంగిపొర్లినయి. వందల చెక్‌డ్యాములు కట్టడం వల్ల భూగర్భ జలాలు పెరిగాయి. మహబూబ్‌నగర్ ప్రాంతంలో కూడా ఎండాకాలంలో చెరువులు మత్తళ్లు దుంకినై. ఈ రోజు పంటలు ఎక్కువ పంటలు పండినయ్. నేను సాక్ష్యం. నేను 20 ఏండ్లు హుజూరాబాద్ ఎమ్మెల్యేగా చేసిన.కాల్వల పొంటి తిరిగిన. చివరి ఆయకట్టుకు నీళ్లు ఇస్తామని చెప్పినం. వరంగల్‌కు ఎన్నడూ ఇన్ని నీళ్లు రాలేవు. నల్లగొండకు ఎన్నడూ ఇన్ని నీళ్లు రాలేవు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అయ్యే కరెంట్ బిల్లును పక్కన పెడితే రాష్ట్రానికి ప్రాజెక్టు అద్భుత వరం' అని ఈటల స్పష్టంచేశారు.

బీఆర్ఎస్‌పై పోలీసుల అత్యుత్సాహం..!

- **మల్లాపురంలోనే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని ఉద్యమం**
- **బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య దీక్ష భగ్నం**
- **ఏసీపీ ఆధ్వర్యంలో 70 మందికి పైగా పోలీసు కానిస్టేబుళ్ల దాడి**
- **పలువురు నాయకులకు గాయాలు**
- **బీర్ల అయిలయ్యపై మహిళల నిప్పులు**

దీక్ష వద్ద బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్యను బలవంతంగా లాక్కెళ్తున్న యాదగిరిగుట్ట రూరల్ సీఐ భాస్కర్‌గౌడ్

యాదగిరిగుట్ట, జూన్15: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు అత్యుత్సాహాన్ని చూపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రభుత్వ వైద్యకళాశాలను మల్లాపురంలోనే నెలకొల్పాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. గ్రామానికి చెందిన మహిళలు, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్ దీక్షకు మద్దతు పలికారు. ఆదివారం ఏసీపీ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో సీఐలు భాస్కర్, శంకర్‌గౌడ్, కొండల్‌రావు, ఎస్సైలు ఉదయ్‌తోపాటు 70 మంది కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు ముందస్తు హెచ్చరికలు లేకుండానే ఒక్కసారిగా దీక్షాస్థలికి వచ్చారు. దీక్షలో ఉన్న కర్రె వెంకటయ్యతోపాటు నాయకులను బలవంతంగా లాక్కెళ్లి డీసీఎంలో ఎక్కించారు. దీక్షపై పోలీసుల దాడిని గ్రామ మహిళలు తీవ్రంగా ఖండించారు. పోలీసులా.. రౌడీలా అంటూ నిప్పులు చెరిగారు. ఎందుకు దాడి చేసి దీక్షను భగ్నం చేస్తున్నారో చెప్పాలని ఏసీపీ శ్రీనివాస్ నాయుడిని నిలదీశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఓట్లు వేస్తే ఇలాచేస్తారా అని మండిపడ్డారు. నాయకులను అరెస్టు చేసి తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. వెంటనే వాళ్లను వదిలిపెట్టాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. తన అమ్మమ్మ గ్రామమైన మల్లాపురాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే అయిలయ్య పోలీసులతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మహిళలు మండిపడ్డారు. ఇంత మంది పోలీసులను పంపి దీక్షను భగ్నం చేయాల్సిన అవసరమేమొచ్చిందని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. మల్లాపురంలో వైద్యకళాశాల ఏర్పాటు చేసేవరకు ఊరుకునేదిలేదని స్పష్టంచేశారు. ప్రతి ఆడపడుచు కర్రె వెంకటయ్యకు మద్దతుగా నిలుస్తామని ప్రతినబూనారు.

పూర్తి బాధ్యత ఎమ్మెల్యే బీర్ల.. సీఐ కొండల్‌రావుదే

ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇంట్లో పనిచేసే గంధమల్ల రవి అనుమానాస్పద మృతిపై ప్రశ్నించిన బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్యపై ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారు. రవి మృతిపై దృష్టి మళ్లించేందుకే పోలీసులను పెట్టించి కర్రె వెంకటయ్యను అరెస్టు చేసినట్టు ఉంది. ఆయనతోపాటు 30 మంది బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గతంలో యాదగిరిగుట్ట రూరల్ సీఐగా పనిచేసిన కొండల్‌రావు బీఆర్ఎస్ కార్యకర్తలపై ఇష్టారాజ్యంగా కేసులు పెట్టారు. ఇప్పుడు మల్లాపురంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రవి అనుమానాస్పద మృతిపై సోషల్ మీడియాలో వైరల్ చేస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వెంకటయ్యకు ఎలాంటి హాని జరిగినా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, సీఐ కొండల్‌రావే పూర్తి బాధ్యత వహించాలి.

- గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి

ఉద్యమాన్ని కొనసాగిస్తాం: కర్రె వెంకటయ్య

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 183 కోట్లతో మంజూరైన వైద్య కళాశాలను మల్లాపురంలో ఏర్పాటుచేసేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య స్పష్టం చేశారు. మల్లాపురంలో అరెస్టు చేసిన ఆయనను వలిగొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వైద పరీక్షల కోసం వలిగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడే మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి చేతుల మీదుగా నిమ్మరసం తాగి దీక్షను తాత్కాలికంగా విరమించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దాతారుపల్లిలో వంద ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఆ ప్రాంతంలోనే వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారని ఆరోపించారు. ఆ ప్రాంతం వైద్యకళాశాలకు అనువైనది కాదని స్పష్టం చేశారు.



పండ్ల దుకాణాలను తొలగించొద్దంటూ ఫోన్‌లో ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పండ్ల వ్యాపారులపై జులుం ప్రదర్శించొద్దు

- **ఆర్టీసీ అధికారులపై మండిపడిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 15 : రెక్కాడితే గానీ డొక్కాడని పేదలు పండ్ల వ్యాపారులపై ఆర్టీసీ అధికారులు జులుం ప్రదర్శించడంపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని కొత్త బస్టాండ్ మీద ఆధారపడి జీవిస్తున్న ఆటో డ్రైవర్లు, పండ్ల వ్యాపారులతోపాటు చిరు వ్యాపారుల కుటుంబాలను మాజీ మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్టీఎల్ జోన్‌లో బస్టాండ్ ఉందని, వెంటనే తొలగించాలని డిమాండ్‌చేశారు. బస్టాండ్ ముందు పేదలు పెట్టుకున్న పండ్ల వ్యాపారాలను తొలగించవద్దని కోరారు. తొలగింపు ప్రక్రియ చేపడితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

సోమాజిగూడలో మీడియాతో మాట్లాడుతున్న సంజీవ్‌నాయక్

కాంగ్రెస్‌పై గిరిపుత్రుల పోరు తప్పదు

- **క్షేత్రస్థాయి పోరాటానికి సిద్ధం**
- **26న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన సభ**
- **కాంగ్రెస్‌లో ఉన్న మా జాతి ఎమ్మెల్యేలది బానిస మనస్తత్వం**
- **సేన అధ్యక్షుడు సంజీవ్‌నాయక్**

ఖైరతాబాద్, జూన్ 15: గిరిజనులను మోసంగించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరు తప్పదని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ హెచ్చరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ లంబాడీలను మభ్యపెట్టి ఓట్లు కొల్లగొట్టిందని ధ్వజమెత్తారు. ఇక నుంచి జాతిలో చైతన్యం నింపుతూ క్షేత్రస్థాయిలో పోరాటానికి సిద్ధమవుతామని వెల్లడించారు. మంత్రుల నియోజకవర్గాల్లో సభలు నిర్వహిస్తామని, చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతామని, తమ ఉద్యమానికి సన్నాహకంగా ఈ నెల 26న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభను నిర్వహిస్తామని వివరించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ లంబాడీల అభివృద్ధికి పాటుడ్డారని కొనియాడారు. రెండుసార్లు మంత్రివర్గంలో స్థానం కల్పించారని, తండాలను పంచాయతీలుగా మార్చారని, 10% రిజర్వేషన్లు పెంచారని, పోడు భూములకు పట్టాలు ఇచ్చారని, సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ తమ జాతికి ద్రోహం చేస్తున్నా, ఆ పార్టీలో ఉన్న నలుగురు ఎమ్మెల్యేలు బానిస మనస్తత్వంతో దద్దమ్మల్లా గిరిజన జాతిని గాలికి వదిలివేశారని మండిపడ్డారు. తిరుమలలో అన్యాక్రాంతమవుతున్న హాథీరాం బాబా ఆస్తులను కాపాడాలని, ఆ ఆశ్రమ మఠాధిపతిగా బంజారా గురువును నియమించాలని డిమాండ్ చేశారు.

పాలిపోతున్న పచ్చదనం

- **సర్కారు నిర్లక్ష్యం.. పల్లెలకు శాపం**
- **హరితహారాన్ని ఎత్తివేసిన సర్కారు**
- **వనమహోత్సవానికి మంగళం**
- **ఆనవాళ్లను కోల్పోతున్న నర్సరీలు**
- **నిధుల లేమితో నిర్వహణ కరువు**
- **కేసీఆర్ హయాంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు విశేష కృషి**

జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ పంచాయతీలోని నర్సరీ

జగిత్యాల, జూన్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు పట్టింపులేమితో పల్లెల్లో పచ్చదనం పాలిపోతున్నది. ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యంగా గత సీఎం కేసీఆర్ గ్రామాలకు నెల నెలా ఇచ్చిన గ్రీన్ బడ్జెట్‌తో పచ్చలహారంగా మారిన రాష్ట్రం, ఏడాదిగా కళతప్పుతున్నది. బృహత్తర హరితహారం కార్యక్రమాన్ని ఎత్తేసి, వనమహోత్సవాన్ని చేపట్టిన ప్రభుత్వం, దానికి ఆదిలోనే మంగళంపాడింది. పంచాయతీలకు నిధులివ్వకపోవడంతో కనీసం నర్సరీలనూ నిర్వహించలేని దుస్థితి నెలకొన్నది. కేసీఆర్ సర్కారు హయాంలో ఏటా మొక్కలు నాటి పల్లెలు, పట్టణాలను గ్రీన్‌కారిడార్‌లోకి తెచ్చేందుకు, అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు విశేషంగా కృషి చేశారు. ఫలితంగా తెలంగాణ పచ్చదనంతో పరిఢవిల్లింది. అటవీ విస్తీర్ణం పెరిగింది. పల్లె, పట్టణ ప్రకృతివనాలు, బృహత్ ప్రకృతి వనాలతో కొత్త అందాలను సంతరించుకున్నది. రెండేండ్ల క్రితం వరకు ఏ పంచాయతీ పరిధిలోని నర్సరీని చూసినా వేలాది పూలు, పండ్లు, అరుదైన జాతుల మొక్కలతో ఆహ్లాదంగా కనిపించేది. నేడు ఆ పరిస్థితులు పోయాయి.

పంచాయతీ నిధులకు కాంగ్రెస్ బ్రేక్

కేసీఆర్ ప్రభుత్వం గ్రీన్‌బడ్జెట్,